క్లుప్తంగా

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండపై వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్యప్రసాదసేవా సమితి సభ్యులు వేకువజాము నుంచి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సిందూరసేవ, తులసీహారం, పూలహారం, ఆకుపూజ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహంతో ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి



విద్యార్థినికి నోట్ పుస్తకాలు అందిస్తున్న రవికళాధర్ శర్మ

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు, యువత బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.రవి కళాధర్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైష్ణవి కళాశాల ఆడిటోరియంలో ది వర్క్ షాప్ ఆన్ ఫ్లాగ్‌సిప్ స్కీమ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బ్యాంకులు అందించే రుణాలు, పథకాల గురించి వివరించి, విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కళాశాల డైరెక్టర్ గడిగె లింగప్ప, నిర్వాహకులు నాగేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సంజీవ నగర్‌లోని మక్కామసీదు ప్రాంతంలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి,ఈరమ్మ కోరారు. శుక్రవారం ఈ మేరకు ఆ ప్రాంత మహిళలతో కలిసి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..సంజీవ్ నగర్ ప్రాంతంలో మంచినీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మంచినీటి పైప్‌లైన్ లేక బోరు నీరు తాగుతుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి ఎద్దడిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి యోగా తరగతులు

ఆదోని అర్బన్: పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో ఈనెల 27న సాయంత్రం 5.30 గంటల నుంచి యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు బసవరాజు, మాధవ, ఈరన్న, ఎర్రిస్వామి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి, ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుధాకర్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 11 రోజుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయిలో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సి.మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బోడబండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత కె.భీరప్పతో కలిసి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్ఎం నాగన్న, ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ నరసింహులు, వైస్ చైర్మన్ పైరాజ్యం వీరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



విద్యార్థినులతో స్పెషల్ ఆఫీసర్ షబానా

కోసిగి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఆత్య పాత్య పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీన్ తెలిపారు. ఈనెల 16వ తేదీ కర్నూలులో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థినులు ఎం.అమృత, బి.శారద, ఎం.సువార్త, అమృత, రాధిక, స్వాతి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 10వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థినులతో పాటు కృషి చేసిన పీఈటీ సుమంగళను అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: సోమప్ప నగర్‌లోని సీతా రామాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదోనికి చెందిన దాత సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు కెఆర్ శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రావు, మాచాని నాగరాజు శుక్రవారం తెలిపారు. కంటి వైద్య నిపుణులు హేమంత్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు.

నాలుగు నెలలకే మళ్లీ గుంతలు!





నందవరం పోలీస్‌స్టేషన్ ఎదుట గుంతలమయంగా రోడ్డు, నాగలదిన్నె ప్రధాన రోడ్డు దుస్థితి



నందవరం- నాగలదిన్నె రోడ్డులో గుంతలు

- రూ.15 లక్షలతో ముగతి – నందవరం రోడ్డుకు మరమ్మతులు
- గతేడాది నవంబర్‌లో ప్రారంభించి మార్చిలో పనుల ముగింపు
- ఈనెలలో కురిసిన చిన్న వర్షానికే రోడ్డుపై గుంతలు ప్రత్యక్షం

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించకుండా మరమ్మతు పనులకే పరిమితమైంది. గత ఏడాది మండలంలోని ముగతి గ్రామం నుంచి నాగలదిన్నె ప్రధాన రహదారి మర్మమతులకు రూ.15 లక్షలు విడుదల చేసింది. నిరుడు నవంబరు 6న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించగా..ఈ ఏడాది మార్చిలో పూర్తి చేశారు. అయితే మార్చిలో పనులు చేసిన బీటీ రోడ్డుపై అప్పుడే గుంతలు ప్రత్యక్షమయ్యాయి. నాలుగు నెలలకే రోడ్డు పూర్వపు స్థితికి చేరుకుందంటే ఏ మేరకు నాణ్యత పాటించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. చిన్నపాటి వర్షానికే రోడ్డుపైనున్న గుంతల్లో నీరు నిల్వ చేరడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనుల నాణ్యతపై వాహనదారులు, ప్రయాణికులు, స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

జగనన్న హయాంలోనే మైనారిటీల అభ్యున్నతి



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరించిన ముల్లా రసూల్

ఎమ్మిగనూరుటౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడిగా నియామకమైన ముల్లా రసూల్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించడంతో నేడు ముస్లింలు నేడు రిజర్వేషన్లు పొంది అభివృద్ధి చెందుతున్నారన్నారు. తండ్రి అడుగు జాడల్లోనే ఆయన తనయుడు వైఎస్ జగన్ నడిచి ముస్లిం రిజర్వేషన్లను కొనసాగించి, వారి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ముస్లిం మైనారిటీ నాయకులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, నాయకులు ముల్లా ఖాజ, గుర బాషా, ఇస్మాయిల్, కటిక బడేసా, చాంద్, మహబూబ్ హుసేన్, సైఫుల్లా, పెద్ద ఖాజ, హనీఫ్,అస్లాం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



ఎస్వీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివీటి కార్యదర్శి టి. నాగేష్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు పేట అల్లబకాష్ అన్నారు. శుక్రవారం కర్నూలులోని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి పార్టీలో సముచిత స్థానం కల్పించడంపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల జనరల్ సెక్రటరీలు శ్రీను, లింగన్న, నాయకులు రవికుమార్ నాయుడు, ఊశేన్ పటేల్, కల్లుబండి శీను, వీరేష్, చాంద్, దుబ్బన్న, పూజారి మునెప్ప, ఓబులయ్య స్వామి, గోకారి, షాషా, వెంకటేష్, మునిస్వామి, భారతం నజీర్ పాల్గొన్నారు.

టీడీపీకి రాజీనామా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, 19వ వార్డు ఇందిరా నగర్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏయూ భాస్కర్ శిల్పి టీడీపీకి రాజీనామా చేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తగిన గుర్తింపు ఇవ్వక నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించక పోవడంతోనే పార్టీని వీడినట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెద్దకడబూరులోని డ్రైనేజీలు, రోడ్లు పూర్తిగా చెత్త, మురుగుతో నిండిపోయాయని విమర్శించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయంలో స్థానికులు భయంతో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు బురదమయమవడంతో ప్రజలు నడవలేని పరిస్థితి తలెత్తుతోందన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

ఆర్లబండలో ఈరన్న స్వామి ఆలయ ప్రారంభోత్సవం



హాజరైన ఆర్లబండ అంబ భవాని ఆలయ పీఠాధిపతి మర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేకువజామున నుంచే వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆర్లబండ అంబ భవాని ఆలయ పీఠాధిపతి మర్రిస్వామి చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ్ హాజరయ్యారు. అతిథులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు శాలువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతుల ఆశీర్వాదం పొందారు. గ్రామస్తులు గాది రెడ్డి, ఎంపీటీసీ తాయమ్మ, పరుశురామ్, హనుమప్ప, భానుప్రకాశ్, ఆదెప్ప, శ్రీరామ్, నరసప్ప, రామిరెడ్డి, బడెసాబ్, ఇస్మాయిల్, శేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 (ప్రభుత్వ-ప్రయివేట్-ప్రజల భాగస్వామ్యం) వ్యవస్థ లక్ష్యమని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక దానిష్ హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ4 విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డీఎస్పీ హేమలత, ఎంపీపీ దానమ్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ జనార్దన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల సభ్యులు, ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారు ఉంటారన్నారు. అట్టడుగున ఉన్న 10 శాతం నిరుపేదలను ఉన్నత స్థాయిలో ఉన్న 20 శాతం వారు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. నియోజకవర్గం నుంచి దిగువ దారిద్ర్య రేఖకు ఉన్న 6,600 కుటుంబాలను గుర్తించామన్నారు. అందులో ఇప్పటివరకు 1,800 బంగారు కుటుంబాలకు 450 మార్గదర్శకులు ఉన్నారన్నారు. సాయం చేసే మనస్సు ఉన్న వారు ముందుకు వచ్చి భాగస్వామ్యం కావాలని కోరారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గం

కౌతాళం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా హనుమేష్, ప్రధాన కార్యదర్శిగా సాయివర్మ, ఉపాధ్యక్షులుగా భరత్, గోవిందు, సంతోష్, రవి, సహాయ కార్యదర్శులుగా ఉరుకుందు, గురు, హరికృష్ణ, నర్సింహా, కోశాధికారిగా వెంకన్న, మహిళా కన్వీనర్‌గా నగరత్నతో పాటు కో కన్వీనర్‌లు, కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మించాలని ఆందోళన

మంత్రాలయం రూరల్: బీసీ హాస్టల్ విద్యార్థులకు తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ నిర్మించాలంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ మోహినుద్దీన్ హాస్టల్‌ను సందర్శించి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వం దృష్టికి నీటి సమస్య



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోనిటౌన్: పట్టణానికి తాగు, సాగునీటిని అందించే 104బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల నల్ల చెరువు మరమ్మతుల విషయమై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో తుంగభద్ర దిగువ కాలువ నుంచి విడుదలైన రా వాటర్‌ను ఎస్ఎస్ ట్యాంకులకు పంపింగ్‌ను ప్రారంభించారు. ముందుగా కాలువలో మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బసాపురం ఎస్ఎస్ ట్యాంకు చెరువు గట్టు తాత్కాలికంగా కొంతవరకు దెబ్బతిందని ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మరమ్మతులు ప్రారంభించి వచ్చే ఏడాది కంతా పూర్తి చేసి 100 శాతం నీటిని నింపుతామన్నారు. అంతవరకు 60 నుంచి 70 శాతం నీటిని నింపి పట్టణ వాసులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' విడుదల చేయాలి



ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘు నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ సర్కర్,రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద ఇస్తామన్న పెట్టుబడి సాయం నిధులను వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతు సంఘు జిల్లా కార్యదర్శి పంపణ్ణ గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏడీఏ మహమ్మద్ ఖాద్రీఇకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..రైతులను మోసం చేయడమే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత వాటిని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ సగం పూర్తయినా పెట్టుబడి సాయం రైతుల ఖాతాలకు జమ చేయకపోవడంతో వారు పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వానికి ముందు చూపు కొరవడటంతో యూరియా కష్టాలు నెలకొన్నాయని మండిపడ్డారు. వ్యాపారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నా అధికారులు కట్టడి చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం తాటూకా నాయకులు మాలిక్, విరూపాక్షి,మద్దిలేటినాయుడు,సోమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న జెడ్పీ పాఠశాల విద్యార్థినులు

మంత్రాలయం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో మాచాని సోమప్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం హంపయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ట్రస్టు సభ్యులు మాచాని సోమనాథ్, రమేష్, గంగాధర్, తారకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు రూ.25 వేలు విలువ గల స్టడీ మెటీరియల్ అందించడం గొప్ప విషమన్నారు. ఉపాధ్యాయులు వితోబరావు, గోపాల్, చంద్రశేఖర్, వీరేష్ రావు, ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఇప్పించండి సార్..



షేక్షావలి

ఈ ఫొటోలోనున్న వ్యక్తి పేరు షేక్షావలి. నందవరం మండలంలోని నదికైరవాడి గ్రామం. ఈయన భార్య గత మూడేళ్ల కింద మృతి చెందింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు ఆసిన్ మంత్రాలయం జెడ్పీ పాఠశాలలో 6వ తరగతి, మరొకరు మాహబూబ్ గ్రామంలోనే ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో షేక్షావలికి అమ్మఒడి కింద నిధులు జమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వంలో తల్లి వందనం కింద నిధులు జమకాకపోవడంతో సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. తల్లి వందనం ఆయన భార్య పేరుపై అప్‌డేట్ కావడంతో ఆధార్ అనుసంధానం చేయాలని అధికారులు సూచించారు. అయితే భార్య మృతి చెందడంతో బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసే వీలులేకుండా పోయింది. గత ప్రభుత్వం మాదిరిగానే తన పేరుతో పథకం సొమ్ము అందజేయాలని కోరుతున్నాడు.

– నందవరం

స్వర్ణామృతప్రాసన మందు పంపిణీ



బాలుడికి మందు వేస్తున్న శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(అవోపా) వారిచే 14వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. ఎస్ఆర్ఐ కాకుబాళ నాగేష్ ఆధ్వర్యంలో చిన్నారులకు అవోపా పట్టణ అధ్యక్షులు వంకధారు శ్రీనాథ్‌గుప్తా, అవోపా సభ్యులు మందును పంపిణీ చేశారు. దాత నగేష్ మాట్లాడుతూ రోగ నిరోధక శక్తి, మేధాశక్తిని, ఆయుష్షును పెంచడంతోపాటు చర్మ సౌందర్యం, మానసిక ఎదుగుదలకు దోహద పడుతున్న స్వర్ణామృత ప్రాసనం మందును 238 మంది చిన్నారులకు అందజేశామన్నారు. ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అవోపా, వామ్ మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకధారు మమతశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

అవ్వ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య



మాట్లాడుతున్న బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య

ఆదోని అర్బన్: మహాయోగి లక్ష్మమ్మవ్వ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య, బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య సూచించారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో బ్యాంకు మెంబర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలపై చర్చించారు. 2025 మార్చి 31 నాటికి రూ.263.68 కోట్ల డిపాజిట్లతో, రూ.183.86 కోట్ల అప్పులతో, నెట్ ఎన్‌పీఏ 0.78 శాతంతో రూ.2.08 కోట్ల నికర లాభాలతో ముందంజలో ఉందన్నారు. బ్యాంకు యేటా వృద్ధిలోకి వస్తుందన్నారు. ఖాతాదారులు, మెంబర్ల సహకారం మరువలేనిదన్నారు. బ్యాంకు అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం



ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ఆదోని సెంట్రల్: మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని త్రీ టౌన్ ఏఎస్ఐ శివప్రసాద్ సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణ పాఠశాలలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని పీల్చాలంటే ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాలన్నారు. తద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. అనంతరం గో గ్రీన్ సేవ్ లైఫ్, చెట్లు ప్రగతికి మెట్లు నినాదాలు చేస్తూ విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరెడ్డి, ఏజీఎం రమేష్ కుమార్ పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

ఆదోని రూరల్: యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను రైతులకు సకాలంలో అందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆయన నిరసన చేపట్టి, ఏడీఏ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడుతూ అధికారులు ఎరువుల కొరత లేదని చెబుతున్నా రైతులకు మాత్రం అందడం లేదన్నారు. వర్షాలు కురుస్తుండటంతో పైర్లకు యూరియా వేసుకునేందుకు రైతులు దుకాణాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల నాయకులు చిన్నతిక్కన్న, మునిస్వామి, పెద్దతుంబళం, నాగనాథనహళ్లి, మదిరె రైతులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ స్థలాలను రక్షించండి

ఆదోని రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ స్థలాలను రక్షించాలని, విద్యుత్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బందిని కొనసాగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు అజీమ్‌ఖాన్, డిపో కార్యదర్శి రవి, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను ప్రయివేట్ వారికి కారు చౌకగా అద్దెకు ఇవ్వడం, విక్రయించడం తగదన్నారు. గాజువాక డిపో-2 స్థలాన్ని ప్రయివేట్ సంస్థకు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో

సంక్షిప్తం

ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చరణ్‌తేజ్, శశి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా

పెద్దకడబూరు: పొదుపు మహిళా సంఘాలకు రుణాలు సకాలంలో మంజూరు చేయకపోవడంపై ఆగ్రహించిన రైతుసంఘం నాయకులు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ మాట్లాడుతూ.. బ్యాంకు మేనేజర్ చేతివాటం వల్ల మహిళా సంఘాల సభ్యులు నెలల తరబడి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. పూర్తిగా వడ్డీలు చెల్లించినా... మంజూరవ్వాల్సిన రుణాలు కాలయాపనకు గురవుతున్నాయని చెప్పారు. రైతులకు రుణాలు మంజూరు చేయడంలో కూడా మేనేజర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రుణాల మంజూరులో జాప్యం చేస్తున్న మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు వీరేష్, ఆంజనేయ, రామాంజినీ, బాబు, కాశీం, హనుమంతు, ఉరుకుందు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజలు పట్టణంలో పారిశుద్ధ్య పనులకు సహకరించి తడి చెత్త,పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ, గుడికల్ రోడ్, ఎస్ఎంటీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడి పలు సూచనలిచ్చారు. ఖాళీ స్థలాల యజమానులు స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా సీఎంఎం జయవర్ధన్ పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోనెగండ్ల/ఎమ్మిగనూరురూరల్: : పత్తి పంటను ఆశించే పేను బంక, తెల్ల దోమ, తామర పురుగులను గుర్తించి సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో ఏఓ హేమలతతో, ఎమ్మిగనూరు ఏఓ మదిరెపల్లి శివశంకర్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లోని పత్తి పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి పంటలో పెద్ద పచ్చ దోమ రెక్కలతో పిల్ల దోమ రెక్కలు లేకుండా లేదా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పెద్ద దోమ ముందు రెక్కలపై నల్లటి మచ్చ ఉంటుందని చెప్పారు. పిల్ల, పెద్ద దోమలు అడ్డంగా నడుస్తూ ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీలుస్తుంటాయన్నారు. ఇవి ఆశించిన మొక్కల ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఆకంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకుపోతాయని చెప్పారు. పచ్చదోమ ఎక్కువైతే పైరు పెరుగుదల క్షీణించి మొగ్గలు రాక దిగుబడి తగ్గుతుందన్నారు. నివారణకు.. అసిఫెట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 గ్రాములు లేదా థయోమిథాక్సం 0.3 గ్రాములు లేదా ఫ్లోనికా మైడ్ 0.3 గ్రాములు లేదా ఫెన్యంతురాన్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని వివరించారు. పచ్చదోమ, పేనుబంక, తెల్లదోమ, తామరు పురుగులు ఆశిస్తే.. ఎకరాకు 30 పసుపు రంగు జిగురు అట్టలు, 30 నీలిరంగు జిగురు అట్టలు, 20 తెలుపు రంగు జిగురు అట్టలు మొక్కకు ఒక అడుగు పై భాగాన పెట్టుకోవాలని సూచించారు.